సాక్షి చిత్తూరు

శనివారం । 8 । జూలై । 2023



డెంగీ డేంజర్..!

జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. దోమల వ్యాప్తిని కట్టడి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

- 8లో



చెరువులో పసికందు మృతదేహం

కుప్పం చెరువులో శుక్రవారం ఓ ఆడ శిశువు మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	34	24
తిరుమల	31	21
గూడూరు	37	28
నగరి	36	26

న్యూస్‌రీల్

బోయకొండలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయం ఆరంభం కాగానే అమ్మవారికి వేదపండితులు విశేషంగా అభిషేకం చేశారు. వేదపండితులచే అమ్మవారికి అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం గంగమ్మతల్లిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లావాసులు





రెడ్డిశేఖర్‌రెడ్డి , గోవిందస్వామి



వేణుగోపాల్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్‌టీఎఫ్ (వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర కమిటీలో ముగ్గురు జిల్లా వాసులకు చోటు లభించింది. ఇటీవల తాడేపల్లెలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కల్పలత సమక్షంలో వీరిని ఎన్నుకున్నారు. వైఎస్సార్‌టీఎఫ్ కోశాధికారిగా వి.రెడ్డిశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోవిందస్వామి, కార్యదర్శిగా వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, రూ.వేల కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సంఘాన్ని బలోపేతం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వెల్లడించారు.

సమష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి



విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్ : అన్నిశాఖల అధికారులు సమిష్టిగా పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి కోరారు. ఇటీవల జిల్లాలో సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించడంపై శుక్రవారం అధికారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటనలో చూపించిన స్ఫూర్తిని కొనసాగిస్తూ అందరూ కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రాజశేఖర్, ఏఎస్పీ శ్రీలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డల్లాస్‌లో వైఎస్సార్ జయంతి




వైఎస్సార్ జయంతి నిర్వహిస్తున్న నేతలు

వెదురుకుప్పం : యూఎస్‌ఏలోని డల్లాస్‌లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలానికి చెందిన టీకేఎంపురం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు హేమశేఖర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసినివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

నేడు జగనన్న ప్రగతి పథం యాత్ర

కుప్పం: వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని జగనన్న ప్రగతిపథం పేరిట బెంగళూరు నుంచి కుప్పం వరకు శనివారం యాత్ర చేపట్టనున్నట్లు సోషల్ మీడియా టీమ్ తెలిపారు. ఉదయం 6 గంటలకు బెంగళూరులో బయలు దేరి మధ్యాహ్నం కుప్పం చేరుకోనున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పచ్చటి పంట పొలాలను చూస్తే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిరునవ్వే గుర్తుకు వస్తుంది. అవ్వాతాతల కళ్లలో ధీమాను చూస్తే ఆయన కల్పించిన భరోసానే కనిపిస్తుంది. ఆర్థికాభివృద్ధి సాధించిన అక్కచెల్లెమ్మల దరహాసంలో ఆయన అందించిన ప్రోత్సాహం మెరుస్తూ ఉంది. అన్నదాతల ఆనందంలో ఆయన జ్ఞాపకం సజీవంగా నిలిచి ఉంది. బంజరు భూములను సస్యశ్యామలం చేసిన సాగునీటి ప్రాజెక్టులు.. ప్రజల దాహార్తిని తీర్చే రిజర్వాయర్లను చూస్తే ఆయన దార్శనికతే దర్శనమిస్తుంది. ముఖ్యంగా జిల్లా అభివృద్ధిలో ఆయన ముద్రకు ప్రత్యేక స్థానముంది. అన్ని నియోజకవర్గాలతోనూ ఆయనకు ఆత్మీయానుబంధం పెనవేసుకుంది. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో పేదలపై మమకారం చూపుతూ.. రైతులకు అవ్యాజ్యమైన ప్రేమాభిమానాలను పంచుతూ తిరుగులేని నేతగా.. ప్రజాసంక్షేమ పాలకుడిగా ఎనలేని సేవలందించిన డాక్టర్ వైఎస్సార్ జయంతి నేడు.



అన్నదాతల ఆనందం అక్కచెల్లెమ్మల దరహాసం

- నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి
- జిల్లా అభివృద్ధిలో ఆయన ముద్ర ప్రత్యేకం
- 7 నియోజకవర్గాలతోనూ పెనవేసుకున్న అనుబంధం

సాక్షి, చిత్తూరు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో జిల్లాకు విడదీయలేని ఆత్మీయ బంధం ఉంది. ముఖ్యమంత్రిగా ఆయన జిల్లా సర్వతోముఖాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆయా పనుల్లో ఆయన ఇప్పటికీ సజీవంగానే కనిపిస్తుంటారు. అలాగే ప్రస్తుతం జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాలతోనే అవినాభావ సంబంధం ఉంది. ఆయా ప్రాంతాల ప్రజలు, నాయకులతో ఆయన ఎంతో ప్రేమగా ఉండేవారు. డాక్టర్ వైఎస్సార్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో మచ్చుకు కొన్ని..

గాలేరు–నగరి సుజల స్రవంతి

గాలేరు–నగరి సుజల స్రవంతి పథకానికి 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా జిల్లాలోని 1,03,500 ఎకరాలకు సాగునీటిపాటు, ప్రజల దాహార్తిని తీర్చేలా ఈ పథకానికి రూపకల్పన చేశారు. మల్లెమడుగు డ్యామ్, బాలాజీ రిజర్వాయరు, పద్మసాగర్, శ్రీనివాససాగర్, వేణుగోపాలసాగర్‌లను కృష్ణా జలాలతో నింపేలా చర్యలు చేపట్టారు.

- చిత్తూరులో చంద్రబాబు మూయించిన షుగర్ ఫ్యాక్టరీని 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పునఃప్రారంభించి రైతులకు అండగా నిలిచారు.
- పలమనేరు నియోజకవర్గంలో కాలువపల్లె వద్ద కౌండిన్య నదిపై రూ.52 కోట్లతో రిజర్వాయర్ నిర్మించారు. తదనంతర కాలంలో ఆ ప్రాజెక్టుకు వైఎస్సార్ జలాశయం అని పేరు పెట్టారు. అలాగే రూ.210 కోట్లతో పలమనేరును అభివృద్ధి పథంలో నడిపించారు. మున్సిపల్ కార్యాలయ భవనానికి రూ.కోటి మంజూరు చేశారు. హంద్రీనీవా పథకంలో భాగంగా గంగవరం మండలంలో 4 కిలోమీటర్లు కాలువ కోసం రూ.20 కోట్లు కేటాయించారు. గంద్రాజుపల్లెలో 632 ఎకరాల్లో రూ.16 కోట్లతో సెజ్ నిర్మాణం చేపట్టారు.
- కుప్పంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శాంతిపురంలో ఐటీఐ భవనాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారు. పాలారు ప్రాజెక్టు రూపకల్పన చేసి రూ.55కోట్లతో పనులు ప్రారంభించారు. అయితే చంద్రబాబు కోర్టులో కేసు వేయించి ప్రాజెక్టును అడ్డుకున్నారు. విపక్షనేతగా 1999లో ఉచిత విద్యుత్ హామీని కుప్పంలోనే ఇచ్చారు. 2007లో ముఖ్యమంత్రిగా ఆరోగ్య శ్రీ పథకానికి కుప్పంలోనే శ్రీకారం చుట్టారు. అప్పట్లోనే రుణమాఫీ ద్వారా కుప్పం రైతులకు రూ.60.24 కోట్లు లబ్ధి చేకూర్చారు. రూ.69.03 కోట్ల విద్యుత్ బకాయిలను మాఫీ చేశారు. కుప్పం నియోజకవర్గంలో పేదలకు 36 వేల పక్కా ఇళ్లను మంజూరు చేశారు. సుమారు 20వేల మందికి కొత్త ఫించన్లు అందించారు.
- పుంగనూరు నియోజకవర్గ ప్రజల కోసం హంద్రీ–నీవా కాలువను నిర్మించారు. రూ.33 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారు.
- జీడీనెల్లూరులో (వేపంజేరీ నియోజకవర్గం) మహదేవ మంగళం వద్ద 330 కేవీ సామర్థ్యం కలిగిన భారీ విద్యుత్ సబ్‌స్టేషను ప్రారంభించారు. కార్వేటినగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం చేపట్టారు.

నీటిని శుద్ధి చేసే ఈటీపీ ప్లాంట్

చేనేత పరిశ్రమలో నూలుకు రంగు వేసే ప్రక్రియలో భాగంగా వినియోగించే రసాయనాల కారణంగా భూగర్భజలాలు కలుషితమవుతుండేవి. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రసాయన నీటిని శుభ్రపరిచే కామన్ ఈటీపీ ప్లాంటు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే కాకుండా రూ.14 కోట్లు మంజూరు చేశారు.

నగరిలో వంద పడకల ఆస్పత్రి

వైఎస్సార్ హయాంలో నగరికి వంద పడకల ఆస్పత్రి మంజూరైంది. ఈ మేరకు ఆయన రూ.15కోట్లు విడుదల చేశారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

నగరిలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సత్రవాడ వద్ద రూ.36 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించారు. గాలేరు–నగరిని ట్యాంకుకు అనుసంధానం చేయించారు.




గాలేరు- నగరి కాలువ



ఈటీపీ ప్లాంటు



వంద పడకల ఆస్పత్రి



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

బీమా.. ధీమా

- 2022 ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు పరిహారం
- 49,298 మంది అన్నదాతలకు రూ.9.93 కోట్లు
- నేడు రైతు దినోత్సవం సందర్భంగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- జీడీ నెల్లూరులో జిల్లాస్థాయి కార్యక్రమం

జిల్లా సమాచారం

నియోజకవర్గం	లబ్ధిదారులు	అందించే మొత్తం
చిత్తూరు	2,599	రూ.32.04లక్షలు
పూతలపట్టు	14,463	రూ.4.46 కోట్లు
పలమనేరు	10,289	రూ.1.68 కోట్లు
కుప్పం	8,668	రూ.93.35లక్షలు
పుంగనూరు	8,940	రూ.1.92 కోట్లు
నగరి	14	రూ.14 వేలు
జీడీ నెల్లూరు	4,325	రూ.61.14 లక్షలు

చిత్తూరు అగ్రికల్చర్: ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం నిర్వహించనున్న రైతు దినోత్సవంలో అన్నదాతలకు బీమా నగదును అందించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంతో నేరుగా రైతుల ఖాతాల్లోకి పంటల బీమా మొత్తాలను జమ చేయనున్నారు. జిల్లావ్యాపంగా మొత్తం 49,298 మంది రైతులకు రూ. 9.93 కోట్లు అందించనున్నారు. జీడీ నెల్లూరు మండలం పాపిరెడ్డిగారిపల్లెలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కలెక్టర్ షణ్మోహన్ చేతులమీదుగా లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేయనున్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యం



రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. పంటల సాగుకు అన్నదాతలు ఇబ్బంది పడకూడదనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి నిధి అందిస్తోంది. అలాగే ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పంటలకు పరిహారం అందిస్తూ ఆదుకుంటోంది.

– పి.రామచంద్రారెడ్డి , జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్



- చిత్తూరు గిరింపేటలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను పూర్తిగా పక్కనపెట్టేశారు. అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేసేందుకు నిబంధనలకు వ్యతిరేకంగా స్టేట్ సిలబస్ స్థానంలో వివిధ కోర్సులను అమలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని పాఠశాలలపై చర్యలు తీసుకునేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.
- తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఓ కార్పొరేట్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, మెటీరియల్ పేర్లతో వేల రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. ఎన్సీఈఆర్టీ రూపొందించిన పాఠ్యపుస్తకాలను కాకుండా సొంతంగా తయారు చేసుకున్న సిలబస్‌తో ఉన్న బుక్స్‌నే విద్యార్థులకు విక్రయిస్తున్నారు. తాము ముద్రించిన పుస్తకాలనే.. తాము నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నతంగా చదువుకునేందుకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోంది. అందులో భాగంగా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడేలా సిలబస్‌ను రూపొందించింది. తక్కువ ధరకే పాఠ్యపుస్తకాలను అందజేస్తోంది. అయితే సర్కారు లక్ష్యాలను ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నీరుగార్చేస్తున్నాయి. నిబంధనలను బేఖాతర్ చేస్తూ మెటీరియల్ పేరుతో సొంతంగా సిద్ధం చేసిన బుక్స్‌ను పిల్లలకు అంటగడుతున్నాయి. ఇందుకోసం తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నాయి.

పుస్తకాల పేరుతో.. 'ప్రైవేట్' దోపిడీ

- నిబంధనలకు విరుద్ధంగా సొంత సిలబస్
- ప్రభుత్వం ఆదేశాలు బేఖాతర్
- ఇండెంట్ నమోదు చేయని కార్పొరేట్ స్కూళ్లు
- మెటీరియల్ బుక్స్ పేరిట దర్జాగా మోసం
- తల్లిదండ్రుల ముక్కు పిండి భారీ మొత్తంలో వసూళ్లు



ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు

ఉమ్మడి జిల్లా సమాచారం

చిత్తూరు జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు	ఇండెంట్ నమోదు చేసినవవి
500	64
తిరుపతి జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు	**ఇండెంట్ నమోదు చేసినవవి**
709	162

చిత్తూరు కలెక్టరేట్ : సమాజంలోని అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. సర్కారు బడులతో పాటు ప్రైవేట్ స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు సైతం సహకరిస్తోంది. అన్ని పాఠశాలల్లోని పిల్లలకు అమ్మఒడి పథకం కింద నగదు అందజేస్తోంది. అయితే ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల వారు విద్యను అంగట్లో వస్తువుగానే పరిగణిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైతే చాలు దోపిడీకి దుకాణం తెరిచేస్తున్నారు. పిల్లల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడమే కాకుండా, పుస్తకాల పేరుతో వేల రూపాయలు దోచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తూ కాసులు మూటగట్టుకుంటున్నారు.

సొంత పుస్తకాల అమ్మకం!

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తమ బ్రాండ్‌ల పేర్లతో సొంత పుస్తకాలను ముద్రించుకుంటున్నాయి. ఇది నిబంధనలకు వ్యతిరేకమైనా పట్టించుకోవడం లేదు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్సీఈఆర్టీ) రూపొందించిన పాఠ్యపుస్తకాలతోనే బోధన సాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎన్సీఈఆర్టీ పుస్తకాలను ప్రైవేట్ పాఠశాలలకు సరఫరా చేసేందుకు విద్యార్థుల వివరాల ఇండెంట్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఇదివరకే విద్యాశాఖాధికారులు ఆదేశించారు. అయితే వాటిని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు బేఖాతర్ చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కొనుగోలుకు నిరాసక్తత చూపుతున్నాయి.

దోచుకునేందుకే..!

విద్యార్థులకు అందుబాటులో ఉండేలా పాఠ్యపుస్తకాలను నిర్ణీత ధరకే విక్రయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఒకటో తరగతికి రూ.399, 2 వ తరగతికి రూ.425, 3వ తరగతికి రూ.675, 4వ తరగతికి రూ.702, 5వ తరగతికి రూ.727, 6వ తరగతికి రూ.747, 8వ తరగతికి రూ.1181, 9వ తరగతికి రూ.1167, 10వ తరగతికి రూ.859గా పుస్తకాల ధరలను నిర్ణయించింది. దుకాణాల్లో సైతం అదే ధరలకు పుస్తకాలను విక్రయించాలని స్పష్టంగా పేర్కొంది. అయితే ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల వారు వేరే కంపెనీల పుస్తకాలను అధిక ధరలకు విక్రయించి తల్లిదండ్రులను దోచుకుంటున్నారని విద్యార్థి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. రూ.3వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తూ సొంత సిలబస్‌తో కూడిన బుక్స్ అంటగడుతున్నారని మండిపడుతున్నారు.

గుర్తింపు రద్దు చేయాలి



విద్యాసంస్థలన సేవా దృక్పథంతో నిర్వహించాలి. అయితే ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా విద్యా వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్సీఈఆర్టీ పుస్తకాలనే పిల్లలకు అందజేయాలి. అయితే సొంత సిలబస్‌తో రూపొందించిన బుక్స్ ఇస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. ఇలాంటి పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని. వాటి గుర్తింపును రద్దు చేయాలి.

– శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కఠిన చర్యలు తప్పవు



ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్సీఈఆర్‌టీ సిలబస్‌నే అమలు చేయాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వ నిబంధనలను ఎవరైనా కచ్చితంగా పాటించాల్సిందే. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. క్షేత్ర స్థాయిలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులు వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. ఎంఈఓ, డీవైఈఓ, డీఈఓ కార్యాలయాల్లోనూ ఫిర్యాదు చేయవచ్చు. పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తే సహించే ప్రసక్తే లేదు.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాల ద్వారా గ్రామ స్వరాజ్యం ఆవిష్కృతమైందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం జీడీనెల్లూరు మండలం విజం సచివాలయ పరిధిలోని ఎస్‌ఎస్ కొండలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2 వేల జనాభా ఉన్న ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తూ జగనన్న పేదలకు దేవుడిగా మారిపోయారని వివరించారు. చంద్రబాబు నాయుడు, భజన బృందం అవాకులు చవాకులు పేలుతున్నారని, ఆయన జీవితంలో ఇక ముఖ్యమంత్రి కాలేరని, 2024 ఎన్నికలే చివరివి కావొచ్చని తెలిపారు. 14 ఏళ్ల పాలనలో ఎప్పుడూ ప్రజాసమస్యలను పట్టించుకోలేదని, స్వలాభం కోసమే పనిచేశారని విమర్శించారు. రాష్ట్ర విభజన తర్వాత కమీషన్లకు కక్కుర్తి పడి ప్యాకేజీలతో ప్రజలను దగా చేశారని ఆరోపించారు. పొదుపు రుణాలు మాఫీ చేస్తామని అక్కచెల్లెమ్మలను సైతం బాబు మోసం చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఆసరా పథకం కింద విడతల వారీగా రూ.18వేల కోట్లను అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, ఐకేపీ ఏపీఎం చిరంజీవి పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో ఉపాధి.. ఉద్యోగాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పరిశ్రమల స్థాపించడం ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన పరిశ్రమలను నెలకొల్పేందుకు ఆసక్తి ఉన్న వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.55.17 కోట్ల పెట్టుబడితో ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి రెండు మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీంతో 455 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నట్లు తెలిపారు. రూ. రూ.90.17 కోట్ల పెట్టుబడితో 650 చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలకు సంబంధించి పోర్టల్ లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. జిల్లాలో 3 భారీ, అతి భారీ పరిశ్రమలకు సంబంధించి అనుమతులు ఇవ్వడం జరిగిందని వివరించారు. ఇందులో పుంగనూరు, ఆరడిగుంటలో నిర్మించిననున్న ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమకు ఇటీవల భూమి పూజ చేసినట్లు చెప్పారు. ఎంఎస్‌ఎంఈ ద్వారా రూ.10 కోట్లకు పైబడి 5 పరిశ్రమలు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్‌కు సంబంధించి ఇప్పటి వరకు 103 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. అందులో 80 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని, మిగిలిన వాటిని త్వరలో పరిశీలించనున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఐసీ జీఎం చంద్ర శేఖర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ, ఎల్‌డీఎం హరీష్, నాబార్డు డీడీఎం సునీల్, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస రావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజ్యలక్ష్మి, డీపీఓ లక్ష్మి, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మదన్ మోహన్‌రెడ్డి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ యజమానులు గోవర్ధన్ బాబి, పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో ఖాళీ పదవులకు ఎన్నికలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో–ఆప్షన్ మెంబర్‌లను ఎన్నుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసహాని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామకుప్పంలో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికకు గతంలో కోరం లేక ఎంపిక వాయిదా పడింది. అలాగే విజయపురం వైస్ ఎంపీపీ–2 దశరథ ఇటీవల 1998 డీఎస్సీ అర్హత సాధించి ఉపాధ్యాయుడిగా ఉద్యోగం రావడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. చిత్తూరు రూరల్ కో–ఆప్షన్ మెంబర్ ఖలీల్ అనారోగ్యంతో మరణించడంతో ఈ పదవి భర్తీ చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

రైతులకు ప్రభుత్వ చేయూత


కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : రైతులకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2022 ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు వైఎస్సార్ ఉచిత బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పరిహారం అందించనున్నట్లు వెల్లడించారు. జీడీనెల్లూరు మండలం పెద్దకుంటపల్లెలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

దుర్గమ్మకు వినాయకుని పట్టు వస్త్రాలు


పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ దంపతులు, అధికారులు

కాణిపాకం(యాదమరి): విజయవాడ కనకదుర్గమ్మకు శుక్రవారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు దంపతులు సమర్పించారు. విజయవాడ కనక దుర్గమ్మ ఆషాడ మాసం శాకాంబరి ఉత్సవాల్లో భాగంగా కాణిపాక ఆలయం నుంచి పట్టు వస్త్రాలను తీసుకెళ్లారు. వారికి ఆలయ ఈఓ భ్రమరాంబ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయ డీఈఓ గురుప్రసాద్, ఏఈఓ చందశేఖర్, కాణిపాక ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

హామీలిచ్చి మోసం చేసేవారితో అప్రమత్తం


లబ్ధిదారుకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం : ఎన్నికల సమయంలో వందల హామీలు గుప్పించి, గెలిచిన తర్వాత మోసం చేసేవారితో అప్రమత్తంగా ఉండాలని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొలమడుగు, కొత్తూరు, రామాపురం, అమ్మవారిపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో వారు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ నమ్మిన వారిని మోసం చేయటంలో చంద్రబాబు దిట్టని తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలు, రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మోసం చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాట తప్పకుండా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో రూ.26 వేల కోట్లను డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణమాఫీగా చెల్లించారని వివరించారు. కుప్పం ప్రజల ఓట్లతో ఎన్నో పదవులు పొందిన చంద్రబాబు ఇక్కడివారికి కూడా న్యాయం చేయలేదని చెప్పారు. కుప్పం ప్రజలు ఈ తేడాను గమనించి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు పట్టం కట్టారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివక్ష లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలను అందిస్తున్నామన్నారు. నాడు–నేడుతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామని వెల్లడించారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి ఆదర్శవంతమైన పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ పట్టాభి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పెద్దన్న, సుకుమార్, సర్పంచ్ మంజునాథ్, ఎంపీటీసీ సభ్యుడు దేవేంద్రప్ప, నాయకులు మునిరత్నంగౌడ్, శ్రీరాములు, నారాయణప్ప, సాగర్, రామచంద్ర, విజయకుమార్, అశ్వత్‌బాబు, రమేష్, వీరభద్రప్ప, చలపతి, కృష్ పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,420

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పలమనేరు: పట్టణంలోని గంటావూరు బీసీ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న యుగంధర్(19)ని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్ కథనం.. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసి గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 1.200 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని పాతపేట జెండా మఠం ప్రాంతంలో పలువురు గంజా విక్రయాలే వృత్తిగా చేసుకుని అమాయకులను ఈ వృత్తిలోకి దించుతున్నట్లు తేలిందని సీఐ తెలిపారు. త్వరలో అసలు స్మగ్లర్లను పట్టుకుంటామని తెలిపారు.

చిత్తూరులో..

చిత్తూరు అర్బన్: యాదమరి మండలంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. తమిళనాడు సరిహద్దులోని తెల్లరాళ్లపల్లె గ్రామానికి చెందిన చిదంబరం(53) గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

బాధితునికి సర్కారు సహాయం


ముఖ్యమంత్రికి తన బాధను విన్నవించుకుంటున్న బాధితుడు గౌతమ్ (ఫైల్)


గౌతమ్ తండ్రి బాలకృష్ణకు రూ.4 లక్షల చెక్కు అందజేస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : అనారోగ్యంతో బాధపడుతున్న ఎస్.ఆర్.పురం మండలం పుల్లూరుకు చెందిన గౌతమ్‌కు రూ.4 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గౌతమ్‌కు ఇటీవల జిల్లాకు విచ్చేసిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అతను 11 నెలల క్రితం కరెంట్ షాకుకు గురయ్యాడు. చెన్నైలో చికిత్స కోసం ఆర్థిక సహాయం చేయాలని సీఎంకు విన్నవించారు. స్పందించిన సీఎం రూ.4 లక్షల ఆర్థిక సహాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు చెక్కును గౌతమ్ తండ్రి బాలకృష్ణకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అందజేశారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలోని ఇరువారం శ్మశాన వాటిక వద్ద శుక్రవారం డీటీఎఫ్ అధికారులు దాడి చేసి కర్ణాటక మద్యం విక్రయిస్తున్న అబ్దుల్ రవూఫ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 672 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎస్ఐ మస్తాన్‌వలీ, సిబ్బంది శ్రీనాథ్‌రెడ్డి, నాగరాజు, దశరథ, గౌతమ్ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం మొగిలి క్రాస్‌లో శుక్రవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. కృష్ణమూర్తి (42) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 184 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దాడిలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం గౌడు, కిరణ్‌కుమార్, వెంకటేష్, మోహన్, కృష్ణ పాల్గొన్నారు.

12 మంది ఎర్రకూలీల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కల్లూరు: ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న 12 మంది కూలీలను అరెస్టు చేసినట్లు కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కల్లూరు ఘాట్ రోడ్‌లో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. కొమ్మిరెడ్డిగారిపల్లె క్రాస్ నుంచి వస్తున్న వాహనాలను ఆపడానికి ప్రయత్నించామని తెలిపారు. బైక్, ఇన్నోవా, బొలేరో వాహనాలు తమపైకి దూసుకెళ్లడానికి ప్రయత్నించగా వాటిని చాకచక్యంగా పట్టుకున్నామని తెలిపారు. వాటిలో ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వాటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందన్నారు. తమిళనాడుకు చెందిన 12 మంది కూలీలను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

చెరువులో పసికందు మృతదేహం

కుప్పం : ముక్కు పచ్చలారని పసికందు మృతదేహంగా మారింది. కన్ను తెరిచి లోకం చూడకనే అసువులు బాసింది. శుక్రవారం కుప్పంలో చెరువులో ఓ ఆడ శిశువు మృతదేహం తేలింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికుల కళ్లు చెమర్చాయి. బిడ్డను చెరువులో పడేసిన ఘటన చూపరులను కదిలించింది.

జాతీయ స్థాయి వ్యాస రచన పోటీల్లో యాదమరి విద్యార్థుల ప్రతిభ


రిషిక


జాహ్నవి

యాదమరి : స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా సాంస్కృతిక సమితి పలమనేరు ప్రతినిధులు జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో యాదమరి ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని రిషిక, తొమ్మిదో తరగతి విద్యార్థిని జాహ్నవి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వారికి ఈ నెల 9న పలమనేరులోని కళామందిర్‌లో బహుమతులు ఇవ్వనున్నారు. విద్యార్థినులను హెచ్ఎం గిరిరాజ, డ్రాయింగ్ మాస్టర్ దావె

డెంగీ డేంజర్..!



- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- దోమల ఉధృతితోనే కేసులు
- అపరిశుభ్ర వాతావరణమే కారణమంటున్న వైద్యులు
- వ్యాధి కట్టడికి పకడ్బందీ చర్యలు
- 1నుంచి కొనసాగుతున్న డెంగీ మాసోత్సవం

వ్యాధి లక్షణాలు ఇలా..
- శరీర ఉష్ణోగ్రత పెరగడం
- వాంతులు, విరేచనాలు
- కళ్ల మంటలు, తీవ్రమైన తలనొప్పి
- చర్మ సమస్యలు
- చిగుళ్ల నుంచి రక్తస్రావం
- మూత్రం, మలంలో రక్తం పడటం
- కడుపు నొప్పి, జలుబు, దగ్గు
- నీరసం

జాగ్రత్తలు ఇలా..
- డెంగీ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- ఇంటి పరిసరాల్లో మురుగు నీరు, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బోండాలు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- నీటి ట్యాంకులు, కుండలు, క్యాన్లను తరచూ శుభ్రం చేసుకోవాలి.
- ఇంటి గదుల్లో గాలి వెలుతురు ఎక్కువగా ఉండేలా చూడాలి.

చిత్తూరు రూరల్: జిల్లాలో డెంగీ కేసులు దడ పుట్టిస్తున్నాయి. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతుండడంతో డెంగీ కేసులు పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. దీంతో పెద్దసంఖ్యలో జ్వరపీడితులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. డెంగీ నిర్ధారణ పరీక్షలకు బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో డెంగీ నియంత్రణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 1వతేదీ నుంచి డెంగీ మాసోత్సవం నిర్వహిస్తోంది.

పెరుగుతున్న కేసులు

జిల్లాలోని 50 పీహెచ్‌సీ, 14 అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో ప్రస్తుతం 80 డెంగీ కేసులు నమోదయ్యాయి. చిత్తూరు నగరంలోనే 18 కేసులు నిర్ధారణ కాగా నగరిలో 5 కేసులు, మిగిలిన చోట్ల ఒకటి చొప్పున్న కేసులు తేలాయి. ఈక్రమంలో 28 గ్రామాలను సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్నారు.

దోమ కాటుతోనే..

దోమ కాటు వల్లే మలేరియా, బోదకాలు, చికున్‌గున్యా, డెంగీ, ఎల్లో ఫీవర్ వంటి వ్యాధులు సంక్రమిస్తాయి. వర్షా కాలంలో దోమల వల్ల ప్రతి ఇంట్లో జ్వర పీడితులు ఉంటున్నారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా దగ్గు, జలుబుతో కూడిన విష జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి.

అపరిశుభ్రతతోనే..

పల్లెలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపించిన చోట్ల దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ చేరడం వల్ల, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం వల్ల దోమలు పెరుగుతున్నాయి. అందుకే దోమల నివారణకు అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో మలాథియాన్ పిచికారీ చేయిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయిస్తున్నారు. అలాగే దోమల నివారించేందుకు కుంటలు, చెరువుల్లో గంబూసియా చేపలు వదిలిపెడుతున్నారు

దోమల కట్టడికి చర్యలు



దోమలను కట్టడి చేస్తూ..డెంగీ నివారణ చర్యలు చేపడుతున్నాం. వర్షాల సీజన్‌లో ప్రభుత్వం ఏటా డెంగీ మాసోత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నెలరోజులపాటు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. అన్ని ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి డెంగీ నివారణ విధానాలను వివరిస్తున్నాం. నెల రోజులపాటు ప్రణాళిక ప్రకారం పకడ్బందీగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

– శ్రీనివాసులు, జిల్లా మలేరియా నివారణాధికారి

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తలు


టీడీపీ కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలోని 50 మంది మహిళలు శుక్రవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్ బాషా, రమేష్, మహబూబ్, ఫజల్, షరీఫ్, షబ్బీర్, పాండ పాల్గొన్నారు.

ప్యాకేజీ వస్తేనే పవన్ రెండో దశ యాత్ర

– ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసులు



తిరుమల: పవన్ కళ్యాణ్‌కు రెండో ప్యాకేజీ వస్తేనే రెండో దశ యాత్ర చేపడతారని ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసులు విమర్శించారు. ఆయన శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ కుటుంబ సమేతంగా ఉదయస్తమాన సేవలో స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జనసేన అధినేతకు ప్యాకేజీ అయిపోయింది కాబట్టి వారాహి యాత్ర వాయిదా వేశారని పేర్కొన్నారు. రెండో దశ ప్యాకేజీ వస్తే మళ్లీ యాత్ర చేపడతారేమోనని తెలిపారు. కేవలం ముడుపుల కోసం ప్రజలకు మోసపూరిత మాటలు చెబుతున్న పవన్ కల్యాణ్‌కు వారే తగిన రీతిలో బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.